క్లుప్తంగా

నేటి నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం

దువ్వూరు : దువ్వూరు మండలంలో గురువారం నుంచి సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ, పల్లెకు పోదాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈనెల 9న గుడిపాడు, 10న దువ్వూరు 2, 14న దువ్వూరు-1, 15న చింతకుంట -2, 16న చింతకుంట -1, 17న చిన్న శింగనపల్లె, 20న అన్నపుశాస్త్రుల పల్లె, 21న టి.చల్లబసాయపల్లె, 22న జిల్లెల్ల, 23న కానగూడూరు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలు ఆయా రోజుల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజుపాళెం : రాజుపాళెం మండలంలో గురువారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దువ్వూరు మండలం గుడిపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని సహకరించాలని కోరారు.

నేడు లక్ష్మీపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. లక్ష్మీపేట గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

మినుము పంటకు పురుగు బెడద



మినుము పంటను ఆశించిన పచ్చ పురుగు

రాజుపాళెం : రైతులు సాగు చేసిన మినుము పంటకు పచ్చ పురుగు, లద్దె పురుగు బెడద ఎక్కువైంది. గత కొన్ని రోజులుగా పొలంలో తేమ శాతం లేకపోవడంతో రైతులు ఎన్నో కష్టాలకోర్చి పంటకు నీటి తడులు అందిస్తున్నారు. అయితే విలువైన మందులు పిచికారి చేసినా పురుగు ఉధృతి తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధర బాగుండటంతో రైతులంతా పంటకు వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటను కాపాడుకుంటూ వస్తున్నారు. సంబంధిత అధికారులు పురుగు ఉధృతి తగ్గేలా ఏయే మందులు పిచికారి చేయాలో తెలియజేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ



రైటింగ్ ప్యాడ్స్ అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కాశినాయన : మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డిల ఆధ్వర్యంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బయ్య, అన్వర్‌బాష, రమణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న వినీత్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ఎస్‌ఆర్‌కే కంపెనీ చైర్మన్, వ్యవస్థాపకుడు ఎస్ రవికుమార్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కడపలోని పలు చోట్ల బుధవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రవికుమార్‌రెడ్డి కుమారుడు లలిత్ సంజీవరెడ్డి, కుటుంబ సభ్యులు, కంపెనీ ప్రతినిధి ఎం వినీత్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద గల అనాథ శరణాలయం, మా అమ్మఒడి పిల్లలకు, రెవెన్యూ సేవా సంస్థల్లో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఎస్‌ఆర్‌కే కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మోసం చేసిన చంద్రబాబును ప్రజలు నమ్మరు

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- నేటి నుంచి 'పల్లెకు పోదాం', 'ఏపీకి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : మహిళలను, రైతులను మోసం చేసిన చంద్రబాబును ఎవరూ నమ్మరని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. టీడీపీ వారికి దమ్ముంటే మేము మేలు చేశాం ఓటేయండి అని ప్రజలను అడగగలరా అని ఆయన సవాల్ విసిరారు. గురువారం నుంచి మండలంలో 'పల్లెకు పోదాం', 'ఏపీకి మళ్లీ జగన్ సీఎం ఎందుకు కావాలి' కార్యక్రమాలు నిర్వహించనున్న సందర్భంగా బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నాలుగున్నరేళ్లలో అనేక పథకాలను అమలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. పథకాలు అందరికీ అందయా లేదా అని నిరంతరం ఆరా తీశారని పేర్కొన్నారు. అర్హత ఉండి కూడా పథకాలు అందని వారికి జగనన్న సురక్షపేరుతో అవసరమైన సరిఫికెట్లు అందజేసి పథకాలు అందేలా చూశారన్నారు. ప్రస్తుతం పల్లెకు పోదాం కార్యక్రమం పేరుతో ప్రజలకు ఏమేమి పథకాలు అందాయి, ఎంత మంది లబ్ధిదారులు అనే విషయాలను వివరించే విధంగా ఆయా సచివాలయాల పరిధిలో వివరాలను పొందుపరచనున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ కార్యక్రమం ముగియగానే పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రానికి అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఏపీకి ముఖ్యమంత్రిగా ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల పరిధిలో పార్టీ జెండాను ఎగురవేస్తామని వివరించారు. ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, జేసీఎస్‌లు, గృహసారథులు, నాయకులు రాత్రి అక్కడే నిద్ర చేస్తారని తెలిపారు. ఉదయమే ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ఎన్నికలకు ముందు ఏమేమి హామీలు ఇచ్చారు, అధికారంలోకి వచ్చాక ఏమేమి చేశారు వారిని అడుగుతారని తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఏమేమి హామీలు ఇచ్చారు, అధికారంలోకి వచ్చాక ఏం చేశారు అనే విషయాలపై ప్రశ్నలు వేసి, ప్రజల నుంచి సమాధానాలు తీసుకుంటామని తెలిపారు. అన్నిటికంటే ముఖ్యమైనది తాము అధికారంలోకి వస్తే అవినీతిని నిర్మూలిస్తామని చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగించడమే కాక, అవినీతిని పెంచి పోషించాడని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆరోపించారు. అందుకు మైదుకూరు మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున జరిగిన అవినీతే ఉదాహరణ అని అన్నారు.

– వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా పథకాలను, కార్యక్రమాలను అమలు చేశారని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, దువ్వూరు, చాపాడు ఎంపీపీలు జయచంద్రారెడ్డి, లక్ష్మయ్య, మైదుకూరు వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, సచివాలయాల, మండలాల కన్వీనర్లు చీపాటి రాజశేఖర్‌రెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, బండి నాగేంద్ర ప్రసాద్, మైదుకూరు పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

మేధో క్రీడ చదరంగం

కడప స్పోర్ట్స్ : మేధో క్రీడ చదరంగం అని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి అన్నారు. బుధవారం కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికలకు చదరంగం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదరంగం క్రీడను సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత అలవడుతుందన్నారు. చదరంగం క్రీడకు పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరుకావడం ఈ క్రీడకు ఉన్న ఆదరణ అర్థమవుతోందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఎంపికలను ప్రారంభించారు. ప్రతిభచాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యప్రభాకర్, ఉమేష్, శ్రీకాంత్, నాగప్రకాష్, చదరంగం ఎంపికల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చదరంగం జిల్లా జట్టుకు ఎంపికయిన బాలికలు

గ్రామ పర్యటనలు విజయవంతం చేద్దాం

దువ్వూరు : జగనన్న మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా ఎందుకు కావాలంటే అనే అంశంపై మండలంలో ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే సమావేశాలను విజయవంతం చేయాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో జరిగే ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, సచివాలయ కన్వీనర్ శంకర్‌రెడ్డి, నాయకులు సంగన హరినాథరెడ్డి, వీరారెడ్డి, బి.వెంకటసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షం రాకతో ఊరట

గోపవరం : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని రైతాంగానికి ఊరట లభించింది. రబీ సీజన్‌లో ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా రైతులు ఎలాంటి పంటలు సాగు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పదును వర్షం పడటంతో పంటలు సాగు చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు సాగు చేయాలని ఇప్పటికే వ్యవసాయాధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జొన్న, మొక్కజొన్న ఇతర పంటలపై రైతులు మొగ్గు చూపనున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతిఒక్కరికి అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని తిరువెంగళాపురం పంచాయతీలోని పాత తిరువెంగళాపురం, పొట్టిగారిపల్లె, పాపిరెడ్డిపల్లె, పోలుగారిపల్లె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయా గ్రామాల్లోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. రాబోవు రోజుల్లో మరింత లబ్ధి చేకూరనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే నిర్మొహమాటంగా తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బిజివేముల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాడు రామసుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, సర్పంచ్ సుబ్బనరసింహ, ఉప సర్పంచ్‌లు క్రిష్టారెడ్డి, కుప్పాల రమణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, శివారెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

మైదుకూరు : ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమంలో ఎస్టీయూ పాత్ర ఎనలేనిదని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం మైదుకూరులో సంఘం రీజినల్ కన్వీనర్ బీకే సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్టీయూ 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సంఘం ఎస్టీయూ అని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో చర్చలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడిచే విధంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. అనంతరం మైదుకూరు, దువ్వూరు మండల శాఖలకు నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు పద్మలత, నరహరిశర్మ, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బి.బాలరాజు, సి.రామచంద్రారెడ్డి, పాలకొండయ్య, సుబ్బారెడ్డి, జిల్లా నాయకులు మల్లేశ్వరరెడ్డి, రమేష్, వీరారెడ్డి, కోకన్వీనర్ నాగేంద్ర, మండల బాధ్యులు రాజు, రవికుమార్‌రెడ్డి, రమణయ్య, మహమ్మద్ జాన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలి



తెలిదేల లక్ష్మీదేవికి రూ.5లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు: వివిధ ప్రమాదాలు ఏర్పడి ఇబ్బందుల్లో ఉండే పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కుచ్చుపాప గ్రామానికి చెందిన తెలిదేల లక్ష్మీదేవి అనే మహిళకు రూ.5లక్షలు, రామసుబ్బమ్మ కొట్టాలు గ్రామానికి చెందిన చింతకుంట వసుంధరకు రూ.1.20లక్షల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ రకాలుగా ప్రమాదాలు, ఇతర విధానాల్లో ఇబ్బందులు పడే కుటుంబీకులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించే నిధులను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ వలి ఆరాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే

దువ్వూరు : మండలంలోని మీర్జఖాన్‌పల్లెలో ఉన్న హుస్సేన్‌వలి స్వామి దర్గాలో బుధవారం స్వామి ఆరాధన కార్యక్రమం దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి పాల్గొని దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాకేజీ టూర్లను సద్వినియోగం చేసుకోండి

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రజలు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్యాకేజీ టూర్లను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. దేవాలయాలు, విహార, విజ్ఞాన సముపార్జన స్థలాలకు వెళ్లే వారికి, వారు కోరిన రోజుల్లో, రెండో శనివారం , ఆదివారాల్లో సూపర్ ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులతో ఈ ప్యాకేజీ టూర్లను అమలు చేస్తున్నట్టు డీఎం పేర్కొన్నారు.

మొదటి ప్యాకేజీ టూర్

మైదుకూరు నుంచి ఉదయం 7 గంటలకు బయల్దేరి దేవుని కడప, ఒంటిమిట్ట, నందలూరు సౌమ్యనాథ ఆలయం, తాళ్లపాక దర్శించుకుని తిరిగి సాయంత్రం 6 గంటలకు మైదుకూరు చేరుతుంది.

రెండవ ప్యాకేజీ టూర్

ఉదయం 7 గంటలకు మైదుకూరు నుంచి బయల్దేరి అల్లాడుపల్లె దేవాలయాలు, సంగమేశ్వర ఆలయం, వేంపల్లె, గండి క్షేత్రం, దేవుని కడప ఆలయాన్ని దర్శించుకుని తిరిగి సాయంత్రం 6 గంటలకు మైదుకూరుకు చేరుతుంది.

మూడో ప్యాకేజీ టూర్

ఉదయం 7 గంటలకు మైదుకూరు నుంచి బయల్దేరి మైలవరం డ్యాం, గండికోటను దర్శించుకుని తిరిగి సాయంత్రం 6 గంటలకు మైదుకూరుకు చేరుతుంది.

నాలుగో ప్యాకేజీ టూర్

ఉదయం 5 గంటలకు విద్యార్థులు ఉన్న పాఠశాల లేదా కాలేజి నుంచి బయల్దేరి శ్రీహరికోట, సోమశిల ప్రాజెక్టు, పెంచలకోన నరసింహస్వామి ఆలయం దర్శించుకుని తిరిగి సాయంత్రం 7 గంటలకు మైదుకూరుకు చేరుతుంది. ఈ ప్యాకేజీ టూర్లకు ఎక్స్‌ప్రెస్ బస్సులో పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.300, సూపర్ లగ్జరీ బస్సుల్లో పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 చెల్లించాలని డీఎం వివరించారు. శ్రీహరికోట టూర్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు, సూపర్ లగ్జరీ బస్సుకు పెద్దలకు, పిల్లలకు రూ.900 చొప్పున చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 9701145249. 9959225781, 7382865848 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

- నేటి నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం
- పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు రోజూ పాల్గొనాలి
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తొలి రోజు మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా వార్డులో, మండలానికి సంబంధించి చౌడూరు గ్రామంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఛాంబర్‌లో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి వరుసగా ప్రజల కోసం కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలు, పరిష్కారమైన సమస్యలపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్, గృహసారథి, కన్వీనర్, వలంటీర్లు, గ్రామ స్థాయిలో ఎంపీపీ, జెడ్పీటీసీ, గృహసారథులు, కన్వీనర్, వలంటీర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షుడు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. తాను రెండు చోట్ల హాజరై కార్యక్రమాన్ని పరిశీలిస్తానన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, తమ ప్రభుత్వ హయాంలో కుటుంబాల వారిగా జరిగిన లబ్ధిని వివరించడం, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండాను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న మేధావులు, విద్యావేత్తలు, వివిధ వ్యక్తుల వారిని సమీకరించి చర్చిస్తామన్నారు. అదే గ్రామంలోని నాయకుని ఇంటిలో సమిష్టిగా భోజనం చేయడం, రాత్రికి నిద్రించడం, మరుసటి రోజు ఉదయం వలంటీర్‌తోపాటు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడటం జరుగుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం నెరవేరిన హామీలను వివరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయని విషయాన్ని ప్రజలకు చెబుతామన్నారు. ఇంత ధైర్యంగా ప్రజల వద్దకు మళ్లీ వెళ్లే ముఖ్యమంత్రిని జగన్‌ను మాత్రమే చూస్తున్నామన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి బెస్ట్ సీఎం అయితే వంద రెట్లు బెస్ట్ సీఎంగా జగన్ పేరు పొందారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఆర్‌టీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

11న జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్, బిఫార్మసీ అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రొద్దుటూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయం అధికారి టి.తిరుపతమ్మ ఒక ప్రటకనలో తెలిపారు. పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీల కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. 10న 6, 7, 9, 10వ తరగతి విద్యార్థులకు కథల పోటీ, 11న 8, 9, 10 తరగతి విద్యార్థులకు వక్తృత్వ పోటీ, 13న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రిటన్ క్విజ్, 6, 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు 14న వ్యాసచన, 15న చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. 19న ఉదయం 9.30 గంటలకు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో పరిధిలో సమస్యలు, ఫిర్యాదుల కోసం ఈనెల 10న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా రవాణా సమస్యలను, ఫిర్యాదులను ఈనెల 10న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225781 నంబర్‌కు ఫోన్ చేసి తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



పాఠశాల బంద్ అనంతరం మాట్లాడుతున్న రవి

పోరుమామిళ్ల : విద్యాసంస్థల బంద్ మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వల్ల నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందనే ఆశతో దశాబ్దాలుగా పోరాడుతున్నా కడపలో ప్రభుత్వరంగంలో పరిశ్రమ ఏర్పాటు కలగానే మిగిలిందని రవి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు గాలికి వదిలిందన్నారు. రాష్ట్ర ప్రజలను కేంద్ర ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. బంద్ నిర్వహణలో మండల నాయకులు సందీప్, వంశీ, వినయ్, నవీన్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ సాధనకు, విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం రాకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు వెంటనే తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ఓ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, రాయలసీమ పరిరక్షణ సమితి నాయకులు గండి సునీల్, ఓబేలేసు, డేవిడ్ రాజ్, ములపాక ప్రతాప్‌రెడ్డి, అఖిలాష్, మోహన్‌బాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి


కాశినాయన : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు తక్షణమే స్పందించి కడప ఉక్కు పరిశ్రమ పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్, పండు, వంశీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : కడప ఉక్కు పరిశ్రమను కేంద్రం ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు శ్రీను తెలిపారు.

వంట ఏజన్సీలకు వేతనాలు పెంచాలి

పోరుమామిళ్ల : విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా వంట ఏజన్సీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మస్తాన్ మాట్లాడుతూ భోజన కార్మికులు చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పేరుతో పిల్లలకు మంచి భోజనం అందిస్తున్నందుకు సంతోషంగా ఉన్నా, వంట మనుషులకు కడుపు నిండటం లేదన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, వంటపాత్రలు, డ్రెస్ కోడ్ లేకపోవడం, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకపోవడం కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

'ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలంటే' విజయవంతం చేయాలి



చాపాడులో సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

చాపాడు : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలంటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ అధ్యక్ష కార్యాలయం వద్ద బుధవారం ఈ నెల 9 నుంచి నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలంటే కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ఏపీలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామసచివాలయ మండల కన్వీనర్ అన్నవరం రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు బద్రిపల్లెలో

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య, మండల అధికారులు హాజరు కానున్న ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ పరిధిలోని ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని తెలియజేయటం, ప్రజల నుంచి వచ్చే సమస్యలు తెలుసుకుని పరిష్కరించటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నేడు బేతాయపల్లెలో..

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామ సచివాలయం పరిధిలో గురువారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్యలు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు. అలాగే సచివాలయం పరిధిలో నాలుగున్నర ఏళ్ళ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరాలను వివరించనున్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బద్వేలు మున్సిపాలిటీలో..

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఆంజనేయనగర్ సచివాలయం పరిధిలో గురువారం సాయంత్రం 3 గంటల నుంచి రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డిలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.